‘సురక్ష’తో శ్రీరామరక్ష

సీఎం జగన్ ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. పేద, మధ్య తరగతి ప్రజల చెంతకే వైద్యసేవలు తీసుకెళ్లారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. వార్డుల వారీగా.. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వైద్యాలయాల్లో సేవలందిస్తున్నారు. ఉచితంగా మందులు అందజేస్తూ.. మరింత మెరుగైన వైద్యం కోసం అవసరం మేరకు వివిధ ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నారు.

- 34వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహణ
- కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలో 328 మందికి వైద్య సేవలు



జగనన్న సురక్ష ఆరోగ్య కార్డులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

అల్లిపురం : మెరుగైన వైద్యానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలోని స్థానికులకు బుధవారం కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. 328 మంది స్థానికులు ఈ శిబిరాన్ని వినియోగించుకున్నారు. వారికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరిని మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. మందులు ఉచితంగా అందజేశారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జోన్–4 కమిషనర్ శివప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ చంద్రిక, యుపీహెచ్‌సీ ఇన్‌చార్జి పి.మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, బోణి దేవ, దూడ అప్పారావు, పార్టీ కార్యకర్తలు శిబిరాన్ని పర్యవేక్షించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలందించారు.



ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి సమక్షంలో వృద్ధునికి కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

చక్కటి వైద్యం అందించారు..



ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్ చేయాలని సూచించారు. వైద్యులు చక్కగా తనిఖీలు నిర్వహించారు. ఇతర సిబ్బంది కూడా చక్కగా ట్రీట్‌మెంట్ అందజేశారు.

– మహ్మద్ ఖత్‌లానా బేగం, అంబేడ్కర్ కాలనీ

పీహెచ్‌సీలో సౌకర్యాలు బాగున్నాయి



గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. వైద్య శిబిరంలో పరీక్షలు చేసి మందులిచ్చారు. పీహెచ్‌సీలో సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయి. వైద్యులు బాగా చూసుకున్నారు.

–కె.రాజేష్, కొబ్బరితోట

మెరుగైన వైద్యం చేశారు



ఒంట్లో నలతగా ఉందని వైద్యానికి వచ్చాను. ఆరోగ్య శిబిరంలో అన్ని పరీక్షలు చేశారు. ముఖ్యంగా రక్త పరీక్ష నిర్వహించి బీపీ చెక్ చేశారు. మందులిచ్చి, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు.

–వడిశల ఈశ్వరమ్మ, కొబ్బరితోట

క్లుప్తంగా

స్త్రీ విద్యకు పూలే కృషి అమోఘం



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గోపి, ఉపాధ్యాయులు తదితరులు

అల్లిపురం : స్త్రీ విద్యకు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం అన్నారు. పూలే జయంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు రంధి గోపి, బీశెట్టి రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆమెకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలే చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : పేదల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. 32వ వార్డు చలువతోటలోని అల్లిపురం–1 సచివాలయం పరిధిలో కంచు వరలక్ష్మి బ్రెయిన్ ట్యూమర్‌తో ఇటీవల చనిపోయారు. వారికి ఆసరాగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్ బీమా మంజూరు చేయించారు. బీమా మొత్తాన్ని ఆయన బుధవారం వారి ఇంటికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులు కంచు ఓంకార్ దుర్గా మాధవ్, నవీన్‌లకు అందజేశారు. కార్యక్రమంలో జోన్–4 కమిషనర్ శివప్రసాద్, పార్టీ నాయకులు ఆదివిష్ణు, సురపతి అప్పన్న, బోని దేవ, గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ఉత్తర నక్షత్ర పూజలు



విశేష అలంకరణలో శ్రీ ధర్మశాస్త స్వామివారు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో అయ్యప్పస్వామికి బుధవారం ఉత్తర నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, అలంకరణ చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ దేవస్థానం చైర్మన్ నీలాపు రమణారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది.

సంకల్ప బలంతోనే కలలు సాకారం



ఎన్నికైన నూతన కార్యవర్గం

సీతమ్మధార : సంకల్పం బలంతోనే కలలు సాకారం అవుతాయని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జోన్ మెంటార్ కేవీరావు అన్నారు. బుధవారం ద్వారకానగర్‌లోని ఒక హోటల్లో జరిగిన జేకాం విశాఖపట్నం 2.0 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. వ్యక్తిగతంగా, వ్యవస్థాగతంగా అభివృద్ధి సాధించడానికి జేకాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యంగ్ బిజినెస్ లీడర్లకు వ్యాపార మెలకువలు బోధించారు. నూతనంగా ఎన్నికైన జేకాం 2.0 టేబుల్ కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా పి.అశోక్ కుమార్, వైస్ చైర్మన్‌గా దాసరి శివగుప్త, సెక్రటరీగా కేఎంకే రమేష్, కోశాధికారిగా వంకాయల శ్రీరంగా, డైరెక్టర్లుగా నవ్య సరికి, కె.రుషి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాన్ని కోచ్ ఎస్.రాజశేఖర్ పర్యవేక్షించారు. పూర్వ చైర్మన్ బి.చైతన్య రాజీవ్‌కుమార్, నూతన చైర్మన్ పి.అశోక్‌కుమార్‌కి బాధ్యతలు అప్పగించారు.

ఓటు నమోదుపై అవగాహన



ఓటు ప్రాధాన్యతను వివరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామమూర్తి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఓటు నమోదు, చైతన్యంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి ఓటుపై అవగాహన కలిగి ఉండాలంటూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామమూర్తి, తహసీల్దార్ టి. ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. అప్పారావు తదితరులు పాల్గొని ఓటర్ ఐడీ ఏ విధంగా నమోదు చేసుకోవాలి? ఓటు విలువ, సమాజంలో విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకురాలు జి. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు, సంస్కృత అకాడమీ నుంచి బీఎడ్ విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దిన మూడో సెమిస్టర్ జీవశాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం–2 పుస్తకాన్ని ఏయూ దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య చంద్రశేఖర్, ఆచార్య సత్యనారాయణ, ఎమిరిటస్ ప్రొఫెసర్ ఆచార్య పరమేశ్వరరావు, పుస్తక రచయితల్లో ఒకరైన డాక్టర్ జయరాం కనకల తదితరులు పాల్గొన్నారు.

చండీహోమం ప్రారంభం



చండీ హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న భవానీలు

అల్లిపురం : మెయిన్‌రోడ్డులో గల దుర్గా భవానీ ఆలయంలో బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చండీ హోమం ప్రారంభమయింది. గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ట చేపట్టిన అనంతరం భవానీలు విజయవాడ పయనమయ్యారు. చండీ హోమం ఐదు రోజులు నిత్య అగ్నిహోత్రం ప్రజ్వరిల్లుతుందని భవానీలు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు భవానీ మాలధారులు అమ్మవారికి కొబ్బరికాయకొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తారని తెలిపారు. తొలుత వినాయక దేవాలయం వద్ద దర్శనం చేసుకుని, నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని, వేంకటేశ్వరమెట్ట దరి దుర్గమ్మను, బల్లిగిరి వేంకటేశ్వరస్వామిని, రాసపోలమాంబ అమ్మవారిని, రైల్వేస్టేషన్ దరి దుర్గమ్మను దర్శించుకుని మెయిన్ రోడ్డులో గల దుర్గా భవానీ ఆలయానికి చేరుకుంటారన్నారు. అక్కడ మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

రేషన్ సరకుల పంపిణీ తీరు పరిశీలన



రేషన్ సరకుల పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట : బురుజుపేటలో రేషన్ సరకుల పంపిణీ తీరును ఆర్‌డీవో డి.హుస్సేన్ సాహెబ్ బుధవారం పరిశీలించారు. సరకుల పంపిణీపై లబ్ధిదారులతో మాట్లాడారు. గడువు తేదీలోపు సరకులు ఇస్తున్నారా అని ఆర్‌డీవో అడిగారు. పంపిణీలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీలర్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహారాణిపేట మండల డిప్యూటీ తహసీల్దార్ ఎల్.చేతన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పిల్లి అప్పారావు, సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమానికి మళ్లీ జగనే కావాలి



జెండాను ఆవిష్కరిస్తున్న వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని 144, 145 సచివాలయాల పరిధిలో బుధవారం ఆంధ్రపదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి గల తేడాను బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అలాగే సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. ముందుగా పార్టీ జెండాను, డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాపూ ఆనంద్, డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమార్ తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని అదిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ముత్యాల అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీకాలనీ : సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా ముత్యాల కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోష్ఠిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 19వ పాశురాన్ని స్వామివారికి విన్నపం చేశారు. బుధవారం ఉదయం, సాయంత్రం స్వామివారికి విశేష దీప హారతి ఇచ్చారు. పూజల అనంతరం సాయంత్రం 365 ఒత్తులతో హారతి వెలిగించి స్వామివారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్ర’



ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో టాస్ వేసి క్రీడలు ప్రారంభిస్తున్న సెక్రటరీలు



క్రికెట్ ఆడుతున్న యువకులు

- ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత

జగదాంబ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సంకల్పించిన ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. ఈ పోటీలకు యువత నుంచి చక్కటి ఆదరణ లభిస్తోంది. బుధవారం నియోజకవర్గం పరిధి జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి.



కబడ్డీ ఆడుతున్న మహిళలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను బీజేపీ నాయకులు 70వ వార్డులో బుధవారం పంపిణీ చేశారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దీనం కొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో వార్డులోని ఎల్వీ నగర్, డ్రైవర్స్ కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డీఈవీ అప్పారావు, వార్డు నాయకులు పావని, సంతోష్, నాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛభారత్

ఏయూక్యాంపస్ : ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కార్యాలయ సిబ్బంది కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రం చేశారు. వ్యర్థాలు, ఎండుటాకులు, కొమ్మలు ఏరివేసి శుభ్రం చేశారు. సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో దీప పాశురం



నరసింహుని అవతారంలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో వెలుగుతున్న జ్యోతులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు, అభిషేకాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం దీప పాశురం (18వ పాశురం) భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణ జరపగా, ఆలయ ధర్మకర్త ఈ.కె.చారి దంపతులు అభిషేకాలు చేశారు. మహిళలు దీపాలంకరణలో పాల్గొన్నారు. తరువాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని సన్నిధిలో ..

అక్కిరెడ్డిపాలెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో బుధవారం దీపపాశురం నిర్వహించారు. ఆలయంలో ఆండాళ్ అమ్మవారి పూజలు నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామిని నరసింహావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ఈవో జగన్నాధరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



దీప పాశురంలో పాల్గొన్న భక్తులు

‘విశాఖ ఉక్కును కాపాడుకుంటాం’



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉద్యమాలతో సాధించుకున్న స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 1056వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ గురించి ప్రజలందరూ నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.